క్లుప్తంగా

గ్రామాల్లో పరిశుభ్రత అవసరం

బంగారుపాళెం: నివాసముంటున్న గ్రామాలను పరిశుభ్రంగా పెట్టుకుని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకునేందుకు కృషి చేయాలని పరివర్తన స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షుడు అమరనాథ్ అన్నారు. మండలంలోని జయంతి గ్రామ పంచాయతీలో శనివారం ఎన్ఎస్ఎఫ్ డీసీ, డీఎన్టీ బోర్డు మహిళా సంఘ సభ్యులచే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహించారు. గ్రామాల్లోని వీధులను శుభ్రపరచారు. గిరిజన ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనిధి గ్రామీణ మ్యాక్స్ సిబ్బంది, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ శ్రీనివాసులు

బంగారుపాళెం: జాతీయ రహదారి పక్కన హోటళ్లు, దాబాలు నిర్వహించే యజమానులు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని హైవే రోడ్డు పక్కన శనివారం దాబాలు, హోటళ్లు నిర్వహించే యజమానులతో సమావేశమై వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. హైవేలో దాబాలు, హోటళ్ల యజమానులు లారీ డ్రైవర్ల నుంచి అక్రమంగా డీజిల్, పెట్రోల్ కొనడం, అమ్మడం వంటి పనులు చేస్తున్నారన్నారు. అలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తప్పవని చెప్పారు. అనంతరం వారిని బైండోవర్ చేసి తహసీల్దార్ ఎదుట హాజరు పరచినట్లు తెలిపారు.

ప్రమాదాల నివారణకు ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి ఘాట్ రోడ్డులో ప్రమాదాలు జరగకుండా కాపాడాలంటూ శనివారం పాస్టర్లు ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని వివిధ చర్చిలకు సంబంధించిన పాస్టర్లు మధ్యాహ్నం మొగిలి ఘాట్ వద్దకు చేరుకుని, మలుపు వద్ద ప్రార్థనలు చేపట్టారు. వాహనదారులు, ప్రయాణికులను ప్రమాదాల బారినుంచి రక్షించాలని ప్రభువును వేడుకున్నట్లు తెలిపారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి



ఎంఎస్ఆర్ కూడలి వద్ద పారిశుధ్య పరిశీలిస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: నగరంలో వర్షాలు పడుతున్న నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజారోగ్యశాఖ అధికారులను చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. నగరంలోని పలు ప్రాంతాలను శనివారం ఆయన పరిశీలించారు. కాలువల్లో వ్యర్థాలు నిలవకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. నీటి ప్రవాహానికి అడ్డులేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కట్టమంచిలోని మామిడికాయల మండీలో కల్వర్టు వద్ద నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్న వ్యర్థాలను వెంటనే తొలగించాలన్నారు. కమిషనర్ వెంట కార్పొరేషన్ అధికారులున్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని జైన్ సంఘ మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంఘ సభ్యులు సుభాష్‌జైన్ తెలిపారు. ఉదయం 7 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

పౌష్టికాహార కిట్లు అందజేత



బాధితులకు కిట్లును అందజేస్తున్న జిల్లా క్షయ నివారణ అధికారి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని రెడ్‌క్రాస్ భవనంలో శనివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో క్షయబాధితులకు పౌష్టికాహార కిట్లును అందజేశారు. ఈ కిట్లును జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్ చేతుల మీదుగా బాధితులకు అందించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు సహదేవ నాయుడు, లావణ్య, విజయకుమార్, గోపి, చిరంజీవి తదితరులున్నారు.

చిత్తూరు: కట్టమంచి వరదరాజుల స్వామి ఆలయంలో విజయానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, బంగారుపాళెం: మొగిలి వెంకటగిరి కోదండరామాలయంలో పూజలు చేస్తున్న సునీల్‌కుమార్, నాయకులు





దుష్ప్రచారం.. బాబు నైజం

- చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించండి
- అన్ని మండలాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- విపక్ష నేతల నిర్బంధం.. బాబు నిరంకుశత్వానికి నిదర్శనం
- చిత్తూరు, పూతలపట్టు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జులు విజయానందరెడ్డి, సునీల్ కుమార్



కలిగిరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న గౌహతి రెడ్డి

కాణిపాకం/బంగారుపాళెం: విశ్వ విఖ్యాతిగాంచిన తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాద పవిత్రతకు మంటగలుపుతూ రాజకీయం చేస్తున్న పాపాత్ములకు మంచి బుద్ధి ప్రసాదించాలంటూ అన్ని మండలాల్లో వైఎస్సార్ సీపీ నేతలు ప్రత్యేక పూజలు చేశారు. చిత్తూరు, పూతలపట్టు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జులు విజయానందరెడ్డి, సునీల్ కుమార్ మీడియాతో మాట్లాడారు. కల్తీ నెయ్యిని స్వామివారి లడ్డూ తయారీకి వినియోగించినట్లు అబద్ధాలు ఆడుతున్న చంద్రబాబు త్వరలోనే తగిన మూల్యం చెల్లించుకుంటారని అన్నారు. భగవంతుడితో రాజకీయం చేసే పాపాత్ములను శ్రీవారే కఠినంగా శిక్షిస్తారని పేర్కొన్నారు. తిరుమల లడ్డూ పవిత్రతను కాపాడాలని, చంద్రబాబు నాయుడికి సద్బుద్ధి ప్రసాదించాలని ప్రార్థించినట్లు తెలిపారు. గత కొద్ది రోజులుగా హిందువుల మనోభావాలు దెబ్బతీస్తూ.. మహా ప్రసాదమైన తిరుమల లడ్డూపై చంద్రబాబు విష ప్రచారం చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీపై జగన్‌మోహన్ రెడ్డిపై బురద చల్లేందుకే ఇలాంటి నీచరాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో ప్రజలకు జరిగిన మేలేంటని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలపై ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు తిరుమల లడ్డూపై వివాదం చేస్తున్నారన్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ హయాంలో టీటీడీ చైర్మన్లుగా ఉన్న కరుణాకర్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి అఖిలాండం వద్ద ఎలాంటి తప్పూ చేయలేదంటూ ప్రమాణం చేశారని గుర్తు చేశారు. బాబు వ్యాఖ్యలు తన రాజకీయ దిగజారుడు, పతనానికి నిదర్శనమన్నారు. ఈ అసత్య ప్రచారంతో హిందువుల మనోభావాలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ఈ తరుణంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తిరుమల పర్యటనకు సిద్ధమైతే, కల్తీ నెయ్యి వ్యవహారాన్ని పక్కన పెట్టి, డిక్లరేషన్ సాకు చూపించి నాలుగు జిల్లాల్లోని నాయకులను నోటీసుల ద్వారా గృహ నిర్బంధం చేయడం చంద్రబాబు నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు.

వరదరాజుల స్వామి ఆలయంలో..

చిత్తూరు నగరం కట్టమంచిలోని శ్రీవరదరాజుల స్వామి ఆలయంలో శనివారం విజయానందరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రత్యేక పూజలు చేశారు. గోవింద నామస్మరణలతో కొబ్బరికాయలు సమర్పించారు. పార్టీ శ్రేణులు, భక్తులకు ప్రసాదం పంచిపెట్టారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, నాయకులు కేపీ శ్రీధర్, మనోహర్‌రెడ్డి, కట్టమంచి బాబురెడ్డి, రజనీ, త్యాగరాజులు, బాబి, రాహుల్‌రెడ్డి, దొడ్డిపల్లి శివ, ప్రతిమారెడ్డి, పలువురు కార్పొరేటర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొగిలి వెంకటగిరి ఆలయంలో..

బంగారుపాళెం మండలం మొగిలి వెంకటగిరి శ్రీకోదండరామస్వామి ఆలయంలో పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తులసీరామకృష్ణారెడ్డి, పాల ఏకరి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుమార్‌రాజా, మండల పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, కో–ఆప్షన్ సభ్యుడు ఫిరోజ్, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, వడ్డెర, కురబ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు మొగిలీశ్వర్, అమరనాథ్, థామస్ పార్టీ జిల్లా కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

కాణిపాకంలో..

లడ్డూపై అసత్య ప్రచారం చేయడం తగదని ఐరాల మండల వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి అనుబంధంగా ఉన్న వరదరాజుల స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని స్వామిని ప్రార్థించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ మోహన్, కాణిపాక ఆలయ మాజీ చైర్మన్ జగన్నాథరెడ్డి, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, నేతలు గణేష్ ప్రసాద్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, దొరబాబు, ప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, విజయానందరెడ్డి, మూర్తి, కరుణాకర్‌నాయుడు, సౌందర్యరాజ్ పాల్గొన్నారు.

పేయన్నగారిపల్లెలో..

ఐరాల: తిరుమల దేవస్థానం లడ్డూపై సీఎం చంద్రబాబు దుష్ప్రచారం చేయడం తగదని గుండ్లపల్లె వైఎస్సార్‌సీపీ సర్పంచ్ రెడ్డెమ్మ అన్నారు. పేయన్నగారిపల్లె శ్రీ వెంకటేశ్వర ఆలయంలో ఆమె స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవుడిపై రాజకీయం చేయడం దుర్మార్గమన్నారు. ఆ దేవుడి పవిత్రతను, ప్రసాదం విశిష్టతను అపహాస్యం చేసేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. మండల వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆయా పంచాయతీల్లోని ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

కలిగిరి కొండపై పూజలు

పూతలపట్టు: మండలంలోని పి.కొత్తకోట సమీపంలో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు తలపులపల్లి బాబురెడ్డి, అమర్‌నాథరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి లడ్డూపై కూటమి ప్రభుత్వం చేస్తున్న అసత్య ఆరోపణలను ఖండిస్తూ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కలికిరి కొండపై వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా కార్యదర్శి గౌహతి రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మజ, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు జయచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, దొరస్వామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, మండల ఎస్సీసెల్ అధ్యక్షులు వెంకటరమణ, మణి, నాగరాజు, షణ్ముగం, త్యాగరాజు, యతీష్, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో..

తవణంపల్లె: పవిత్రమైన తిరుమల శ్రీవారి లడ్డూపై కూటమి ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాన్ని మానుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు హితవు పలికారు. లేకపోతే వేంకటేశ్వర స్వామి తగిన శాస్తి చేస్తారని హెచ్చరించారు. మండలంలోని తొడతరలో వెలసిన శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానం, ఎగువ తవణంపల్లె ఈశ్వరుడి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పూజలు నిర్వహించారు. ఎంపీపీ ప్రతాప్ సుందర్ రాయల్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గాంధీబాబు, మండల కన్వీనర్ హరిరెడ్డి, పార్టీ నాయకులు హరికృష్ణారెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, మధుకుమార్, కిషోర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అబద్ధాలు.. చంద్రబాబుకు మామూలే



దేవున్ని అడ్డం పెట్టుకుని స్వార్థ రాజకీయాలు చేయడం, అబద్ధాలు చెప్పడం చంద్రబాబుకు షరా మాములే. లడ్డూపై అసత్యాలు ప్రచారం చేస్తూ, మతకల్లోలం సృష్టిస్తున్నారు. వెయ్యికాళ్ల మండపం కూల్చివేతలో చంద్రబాబుకు ఆ భగవంతుడే బుద్ధి చెప్పారు. మళ్లీ కూడా ఈ పాపాల చంద్రబాబుకు శ్రీవారే బుద్ధి చెబుతారు.

– పురుషోత్తంరెడ్డి, చుడా మాజీ చైర్మన్

లడ్డూపై కూటమి రచ్చ



లడ్డూ వ్యవహారాన్ని అపవిత్రం చేస్తూ కూటమి రచ్చరచ్చ చేసింది. ప్రపంచంలోనే ప్రసిద్ధిగాంచిన లడ్డూ ప్రసాదంపై అసత్య ప్రచారాలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా లడ్డూపై మరక పూసి వైఎస్సార్‌సీపీకి అంటకట్టడం సరికాదు. పార్టీపై బురద జల్లడానికే ఈ రచ్చ చేస్తున్నారు.

– చంద్రశేఖర్, డిప్యూటీ మేయర్, చిత్తూరు

దేవుళ్లతో రాజకీయాలు



జగన్ తిరుమల పర్యటన రద్దుపై చంద్రబాబు కథలు అల్లుతున్నారు. జగన్‌ను ప్రజల నుంచి దూరం చేయడానికి అబద్ధాలు చెబుతున్నారు. మత కల్లోలం సృష్టిస్తున్నారన్నారు. చంద్రబాబు చేస్తున్న పాపాలు ప్రజలపై పడకుండా వైఎస్సార్‌సీపీ తరఫున పూజలు చేస్తున్నాం. దేవుళ్లను అడ్డంపెట్టుకుని రాజకీయాలు చేయడం సిగ్గుచేటు.

–గాయత్రి దేవి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం మాజీ జిల్లా అధ్యక్షురాలు

స్వార్థ రాజకీయాలు బాధాకరం



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో కులాలు, మతాలు చూడకుండా ప్రజలందరికీ మంచి చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు గడిచినా సూపర్‌సిక్స్ అమలు చేయడంలో దారుణంగా విఫలమైంది. అయితే ఈ ప్రజా వ్యతిరేకతను మళ్లించడానికి చంద్రబాబు దేవుడితో స్వార్థ రాజకీయాలకు దిగడం బాధాకరం.

– హరిణిరెడ్డి, కార్పొరేటర్, చిత్తూరు









కాణిపాకం: శ్రీవరదరాజులస్వామి ఆలయంలో పూజలు, పూతలపట్టు: పి.కొత్తకోట ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ఐరాల: పేయన్నగారిపల్లె ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు, తవణంపల్లె: కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద వైఎస్సార్‌సీపీ నేతలు

మురికివాడలంటే అలుసే మరి..!







వెంగళరావు కాలనీ వద్ద నిలిచిపోయిన మురుగు, కాలువ పొంగి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీళ్లు, ఇళ్లలోకి ప్రవహిస్తున్న వర్షపు, మురుగునీరు

చిత్తూరు అర్బన్: నగరంలో మురికివాడల పట్ల అధికారులకు చిన్నచూపు ఉన్నట్టు స్పష్టమవుతోంది. ఎందుకంటే జాతీయ సఫాయి కర్మచారి చైర్మన్ నుంచి జిల్లా కలెక్టర్ వరకు నగరంలోని 8వ డివిజన్‌లో ఉన్న వెంగళరావు కాలనీని ఇప్పటికే పలుమార్లు సందర్శించారు. ఇక్కడి స్థితిగతులను పరిశీలించారు. ఇక్కడ వర్షం పడిన ప్రతి సారీ మురుగు నీటి కాలువలు పొంగి, ఇళ్ల మధ్య ప్రవహిస్తుంటాయి. ఇళ్లలో ఉపయోగించే మరుగుదొడ్ల నీళ్లు, హోటళ్లు, కళ్యాణ మండపాల్లో ఉపయోగించే మరుగుదొడ్ల నీళ్లన్నీ ఎక్కడెక్కడి నుంచో వచ్చి వెంగళరావు కాలనీలోకి ప్రవహించి, తమ ఇళ్లలోకి వచ్చేస్తున్నాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. అయినా వారి ఆవేదన పట్టించుకునే దిక్కులేదు. రీడ్స్‌పేట నుంచి కాలువను సీఎంటీ రోడ్డుకు మార్పు చేయడమే ఈ సమస్యకు పరిష్కారమని తెలిసినా ఇప్పటి వరకు ఉన్న కమిషనర్లు దీనిపై దృష్టి పెట్టలేదు. కొత్త కమిషనర్ తమ సమస్యకు దారి చూపిస్తారని వెంగళరావు కాలనీ వాసులు ఎదురుచూస్తున్నారు. అప్పటి వరకు చినుకులు పడ్డ ప్రతి సారీ ఇలా మురుగుతోనే కలిసి జీవించాల్సి వస్తోంది. ఇక్కడున్న కాలనీ వాసుల్లో 80 శాతం మంది మునిసిపల్ కార్పొరేషన్‌లో పనిచేసే పారిశుధ్య కార్మికులే కావడం గమనార్హం.

పంటల సాగులో చీడపీడలపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌సీ ఏఓ లక్ష్మీప్రసన్న

ఐరాల: పంటలకు ఆశించే చీడ పీడ పురుగులు, తెగుళ్ల నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టేలా రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా రిసోర్స్ సెంటర్ ఏఓ లక్ష్మీ ప్రసన్న సూచించారు. మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో శనివారం క్రాప్ లైఫ్ సిస్టమ్ యాప్‌పై సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సిబ్బంది పంటలోని చీడపీడల ఫొటోలను తీసి ఈ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. తద్వారా పంటకు ఆశించిన చీడపీడల నివారణకు శాస్త్రవేత్తలు సూచనలు, సలహాలు అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ వరలక్ష్మి, ఏఈఓ ద్రాక్షాయణి, వీపీఏలు, వీహెచ్ఏలు, వీఎస్ఏలు, ఎంపీఈఓఎస్‌లు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కోనేటిరాయని పవిత్ర ప్రతిష్ఠ



ఆలయంలో స్వామి వారి పవిత్ర ప్రతిష్ఠ

గంగవరం: టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామి ఆలయంలో స్వామివారి పవిత్రోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు శనివారం ఉదయం పవిత్ర ప్రతిష్ఠ, సాయంత్రం కుంభారాధనం, హోమాలు వైభవంగా నిర్వహించారు. పెరటాసి రెండవ శనివారం సందర్భంగా బెంగళూరుకు చెందిన గాన సుధా సంగీతశాల ఆధ్వర్యంలో అన్నమాచార్య సంకీర్తాలాపన చేశారు. ప్రతి శనివారం ఈ ఆలయానికి తిరుమల నుంచి 500 లడ్డూ ప్రసాదాలు వస్తాయని టెంపుల్ ఇన్స్‌పెక్టర్ నీరుకుండ గజేంద్ర తెలిపారు. టీటీడీ కంకణంభట్రా ఏకే నరసింహాచార్యులు బృందం, ఆలయ అర్చకులు దేవరాజాచార్యులు పాల్గొన్నారు.

క్రీడల్లో మరింత ఉన్నత స్థాయికి చేరాలి



క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల బృందం

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు క్రీడల్లో మరింత ఉన్నత స్థాయికి చేరాలని మురకంబట్టు వద్ద ఉన్న మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ భార్గవి పిలుపునిచ్చారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఆ పాఠశాలలో శనివారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా ఎంపికల్లో తమ పాఠశాల విద్యార్థినులు గెలుపొందడం అభినందనీయమని పేర్కొన్నారు. అండర్ 14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో పోటీల్లో తమ పాఠశాల జట్టు గెలుపొందినట్లు తెలిపారు. అనంతరం ఆ విద్యార్థినులను అభినందించారు.

వైభవంగా భద్రకాళి ఉత్సవాలు



ఆలయంలో పూజలందుకున్న భద్రకాళీ మాత

గుడిపాల: మండలంలోని నరహరిపేట చెక్‌పోస్ట్ సమీపంలో వెలసిన శ్రీ భద్రకాళి అమ్మవారి ఉత్సవాలు శనివారం అత్యంత భక్తిశద్ధలతో వైభవంగా ప్రారంభమయ్యాయి. నాలుగు దశాబ్దాల క్రితం అటవీ ప్రాంతంలో శ్రీ భద్రకాళి మాత వెలసింది. నాటి నుంచి నేటి వరకు భక్తులను అనుగ్రహిస్తూ, అభయమిస్తోంది. మండల ప్రజలే గాక సమీపంలోని తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి విశేష సంఖ్యలో భక్తులు ఏటా ఈ ఉత్సవాలకు హాజరు కావడం విశేషం. ఆలయంలో శనివారం ఉదయం వేదపండితులు అత్యంత భక్తిశ్రద్ధలతో యాగం నిర్వహించారు. పశుమంద గ్రామానికి చెందిన నిర్మల, రమేష్‌బాబు దంపతులు హోమం, యాగంతో పాటు అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ దీపశ్రీ, అనిల్ కుటుంబసభ్యులు మధ్యాహ్నం వెయ్యిమందికి అన్నదానం చేశారు. భక్తులు వారివారి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి ఆది పరాశక్తి మలిమలన్ సెండియ్ వీధి నాటకాన్ని ప్రదర్శించారు.

రక్తహీనత నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి





పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు, హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలు

తవణంపల్లె: రక్తహీనత రాకుండా గర్భిణులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఐరాల సీడీపీఓ నిర్మల సూచించారు. మండల కేంద్రంలో శనివారం పౌష్టికాహార మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తాజా ఆకుకూరలు, పండ్లు, గుడ్లు, కూరగాయలు విధిగా వాడాలని చెప్పారు. సీహెచ్ఓ సుబ్రమణ్యం మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఐరన్ మాత్రలు తప్పకుండా వాడాలని తెలిపారు. ఆస్పత్రిలో ప్రసవం తల్లీ బిడ్డకు శ్రేయస్కరమన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలించి అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదానానికి దాతల విరాళం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన నిత్య అన్నదాన ట్రస్టుకు శనివారం దాతలు నగదు విరాళం ఇచ్చారు. నెల్లూరు జిల్లాకు చెందిన రఘురాం రూ.1,00,116 నగదును ఆలయ అధికారులకు అందించారు. హైదరాబాద్‌కు చెందిన రాజేంద్రప్రసాద్ రూ.1,00,116 నగదును అందజేశారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ఆలయ పర్యవేక్షకులు చిట్టిబాబు తదితరులున్నారు.